పల్లెల్లో 'పట్టాల' పండుగ..!

17 గ్రామాల్లో 30 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు

- ఒక్కో లబ్ధిదారుడికి 75 గజాల చొప్పున స్థలాలు
- ఈ నెల 9న పంపిణీ చేయనున్న వైనం
- ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు..
- తలనొప్పిగా మారిన ఎంపిక ప్రక్రియ

సొంతింటి కల నెరవేర్చుకునేందుకు సంవత్సరాల తరబడి పోరాటాలు చేసి...ఆశగా ఎదురు చూసిన లబ్ధిదారులకు దశాబ్ది ఉత్సవాలు వారి జీవితాల్లో సొంతింటి కళ నెరవేర్చనున్నాయి. గూడు లేక, గోడు చెప్పిన ఎవరూ పట్టించుకోకపోయినా, కొంత మంది అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న, ఒకే ఇంట్లో మూడు లేదా నాలుగు కుటుంబాలు జీవనం సాగిస్తున్న వారికి ఇదొక తీపు కబురు. ఇందుకు రెవెన్యూ అధికార యంత్రాంగం ఇంటి నిర్మాణానికి అవసరమైయ్యే స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.





మోటాపురంలో ఎంపిక చేసిన ప్రభుత్వ స్థలం (ఇన్‌సెట్) రాజేశ్వరపురంలో స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ దారా ప్రసాద్(ఫైల్)

నేలకొండపల్లి: పాలేరు డివిజన్‌లో 17 గ్రామాల్లో దాదాపుగా 30 ఎకరాల ప్రభుత్వ స్థలాలను ప్లాట్లు చేసి పట్టాలు ఇవ్వడానికి అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందు కోసం ఆయా మండలాల రెవెన్యూ అధికారులు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడంతో ఇప్పటికే భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నేలకొండపల్లి మండలంలోని ఆరు గ్రామాల్లో 415 దరఖాస్తులు వచ్చాయి. ఇదిలా ఉండగా.. లబ్ధిదారులను ఎంపిక చేయడం అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ నెల 9న దశాబ్ది ఉత్సవాల్లో నిరుపేదలకు పట్టాలను అందించనున్నారు. ఇందుకు తగ్గట్టుగా అధికారులు లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు.

డివిజన్ వ్యాప్తంగా వివరాలు..

పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించిన 17 గ్రామాల్లో తొలి విడత ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వనున్నారు. నేలకొండపల్లి మండలంలో ఆరు గ్రామాలు, కూసుమంచిలో రెండు, తిరుమలాయపాలెం మూడు, ఖమ్మం రూరల్‌లో ఆరు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేశారు. ఇందులో నేలకొండపల్లి మండలంలోని అప్పలనరసింహాపురం, నాచేపల్లి, సదాశివాపురం, మోటాపురం, రామచంద్రాపురం, శంకరగిరితండా గ్రామాల్లో 7.13 ఎకరాలు ఎంపిక చేయగా.. తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి, ఇస్లావత్ తండా, హస్నాబాద్ తదితర గ్రామాల్లో ఆరు ఎకరాలు, ఖమ్మం రూరల్‌లోని పొన్నెకల్లు, ఆరెకోడు, కొండాపురం, ఆరెంపుల, చింతపల్లి, బారుగూడెం గ్రామాల్లో దాదాపు 10 ఎకరాలు, కూసుమంచి మండలంలోని నేలపట్ల, పోచారం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి 75 గజాల చొప్పున పట్టాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

రాజకీయ జోక్యం ఉండకూడదు..



ఇళ్ల స్థలాల ఎంపిక విషయంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి. నిరుపేదలను గుర్తించి పట్టాలు అందించాలి. అధికారులు పైరవీలకు తావు లేకుండా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలి. స్థలం వచ్చిన ప్రతీ ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలి.

– పగిడికత్తుల నాగేశ్వరరావు, సీటు నాయకుడు, నేలకొండపల్లి

చాలా సంతోషంగా ఉంది..



సొంత జాగాలో ఇంటి నిర్మాణం చేసుకోవాలని ఎప్పటి నుంచో నా కల. కానీ నేటి వరకూ నెరవేరలేదు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అర్హత కలిగిన పేదలకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికి నా కల సాకారం కాబోతుంది.

– ఇస్లావత్ తిరపతమ్మ, మోటాపురం

నిబంధనలు ప్రకారమే ఎంపిక..



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. నిరుపేదలై, గ్రామంలో నివాసం ఉంటూ.. రేషన్‌కార్డు కలిగి ఉన్న వారు మాత్రమే వీటికి అర్హులు. నిబంధనల ప్రకారమే.. ఈ నెల 9న జిల్లా అధికారుల సూచనలు మేరకు పంపిణీ కార్యక్రమం ఉంటుంది.

– దారా ప్రసాద్, తహసీల్దార్, నేలకొండపల్లి

క్లుప్తంగా

ముగిసిన కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో శ్రీ కంఠమహేశ్వరస్వామి–సురమాంబ దేవి కల్యాణ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో చివరిరోజున గ్రామ దేవ గౌగ సంఘం ఆధ్వర్యంలో వనం ఎల్లమ్మ, వనం మైసమ్మలకు పూజలు, బలిదానాలు సమర్పించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కట్టికోల వెంకటేశ్వర్లు, వెంకన్న, కట్టికోల నాగార్జున, దేవ గౌడ సంఘం అహ్వాన కమిటి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో ప్రత్యేకంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బంజారభవన్ లో ఆదివారం భూక్యా వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. అనంతరం ఐటీడీఏ సాధన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వీరభద్రం, వైస్ చైర్మన్‌గా కిషన్ నాయక్, కోకన్వీనర్‌గా వీరన్ననాయక్, వైస్ చైర్మన్‌గా బస్కినాయక్ తదితరులను ఎన్నుకోగా రమేష్, జ్యోతి, బాలాజీ, రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ..

నేలకొండపల్లి: మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సీ.వై.పుల్లయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కే.వీ.ఎల్. వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. మతోన్మాదం, కార్పొరేటీకరణకు ప్రజలను బలిపశువులు చేస్తే.. రాష్ట్రంలో కేసీఆర్ పేదల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. కేవీఎల్ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పి.వెంకటేశ్వర్లు, భిక్షం, రామదాసు, సాలయ్య, వెంకన్న, భారతమ్మ, ఆనంద్, ప్రవీణ్, రాము, సత్తి, శ్రీను, పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కేంద్ర మంత్రి

రఘునాథపాలెం: ఉత్తమ రైతుగా పేరుపొందిన మండలంలోని చిమ్మపుడికి చెందిన గ్రామ ఉప సర్పంచ్, రైతు గుత్తా వెంకటేశ్వర్లును శనివారం కేంద్రమంత్రి మాన్సుఖ్‌మాండవ్య హైదరాబాద్‌లో రాత్రి జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. కోరమాండల్ నానో టెక్నాలజీ ఆధారిత ఫెర్టిలైజర్, నానో డీఏపీని కోరమాండల్ ఇంటర్నేషనల్ మార్కెట్‌లోకి విడుదల చేసిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ రైతులను సన్మానించారు. కాగా, గుత్తా వెంకటేశ్వర్లు వ్యవసాయ సాగులో సేంద్రీయ పద్ధతిలో పలు రకాల కూరగాయలు సాగు చేసి మంచి ఫలితాలు సాధించడంతో ఆయనకు ఈ సన్మానం దక్కింది.

ఆధ్యాత్మికతతో పరిపక్వమైన జీవితం

ఖమ్మంగాంధీచౌక్: ఆధ్యాత్మికతతో మానవునిలో పరిపక్వత వస్తుందని బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ అరుణకుమారి అన్నారు. ఆదివారం స్థానిక కస్బాబజార్‌లోని బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో మహిళా విభాగం ద్వారా కుటుంబ వ్యవస్థను పటిష్టపర్చటం కోసం నిర్వహించిన పరివారం, స్వశక్తీకరణ అనే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తుల మధ్య అవగాహన కలిగి ఉండి పరస్పరం గౌరవించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షురాలు హైమావతి, విద్యావేత్త మాధవిలత, బ్రహ్మకుమారీలు విజయలలిత, కవిత, గీతా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

వినోద	పరేషాన్
సాయిరాం	అహింస
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	చక్రవ్యూహం

– ఖమ్మంగాంధీచౌక్

భరోసా సెంటర్‌తో మహిళలకు మనోధైర్యం

సీపీ విష్ణు ఎస్.వారియర్



భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న సీపీ

ఖమ్మం క్రైం: న్యాయం కోసం వచ్చే బాధిత మహిళలకు అండగా నిలిచి వారిలో మనోధైర్యాన్ని నింపడానికి భరోసా సెంటర్ సాయపడుతోందని సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా ప్రధాన ఆస్పత్రి ప్రాంగణంలోని భరోసా సెంటర్, షీ టీం సభ్యులు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సీపీ మాట్లాడుతూ.. హింసకు గురైన బాలికలు, మహిళలకు షీ టీం, భరోసా సెంటర్ ద్వారా సత్వర న్యాయం అందుతోందని తెలిపారు. అనంతరం ముగ్గురికి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే, ఐఎంఏ హాల్‌లో ఆటోడ్రైవర్లు, యువతకు ఏర్పాటుచేసిన సదస్సులో సీపీ మాట్లాడుతూ పోలీసు శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు.

పోలీస్ బ్యాండ్ ర్యాలీ..

పోలీస్ బ్యాండ్, సిబ్బంది ఆదివారం నగరంలో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్ ప్రారంభించగా వైరా రోడ్డు మీదుగా పాత కలెక్టర్ నుంచి అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈకార్యక్రమాల్లో ట్రెయినీ అవినాష్‌కుమార్, ఏసీపీలు ప్రసన్నకుమార్, సీఐలు అంజలి, నవీన్, రవి, శ్రీశైలం, సాంబశివరావు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్

బీజేపీ ఎంపీని శిక్షించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురి చేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను శిక్షించి, రెజ్లర్లకు న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం స్థానిక సరిత క్లీనిక్ సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన మహిళా రెజ్లర్లను కేంద్రం పోలీసులతో ఢిల్లీ పురవీధుల్లో ఈడ్చుకెళ్లడం సిగ్గుచేటన్నారు. ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వర్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వీరభద్రం, మిస్రీన్ సుల్తానా, రాష్ట్ర కమిటీ సభ్యులు పర్వీన్, శైలజ, సాయి, ప్రశాంత్, తోకల రవి పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఆందోళన..

రెజ్లర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని చేస్తున్న డిమాండ్ చేస్తూ చేస్తున్న ఆందోళనలో సీపీఐ ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

దాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న యువత

ఖమ్మం వైద్యవిభాగం: వేసవి నేపథ్యాన రక్తం కొరత ఏర్పడడంతో తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి ప్రొద్దుటూరి రవిచంద్ర, వైద్యులు డి.నారాయణమూర్తి కోరారు. నగరంలోని రితన్య ఆస్పత్రి సంకల్ప డే కేర్ సెంటర్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండల ప్రభావంతో రక్తదానం చేసేందుకు ఎవరూ రాకపోవడంతో కొరత ఏర్పడినందురూ దాతలు ముందుకు రావాలన్నారు. సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి అనిత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11న సీపీఐ 'ప్రజాగర్జన'

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 11న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ప్రజాగర్జన పోస్టర్లను ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 4న జరగాల్సిన ప్రజాగర్జన 11వ తేదీకి వాయిదా పడిందని తెలిపారు. పాలక వర్గాలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజాగర్జన సభను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఉపాధి భద్రత చట్టాన్ని అమలు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: టైల్స్ రంగంలో పని చేస్తున్న కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన చట్టాన్ని అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, నగర అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో టైల్స్ రంగంలో పని చేస్తున్న 500 మంది కార్మికులు ఐఎఫ్‌టీయూ అనుబంధ కార్మిక సంఘంలో చేరిన సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు లేక శ్రమ దోపిడీకి గురవుతుంటే దశాబ్ది ఉత్సవాలు చేసుకోవడం సమంజసం కాదన్నారు. అనంతరం ఖమ్మం నగర టైల్స్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఎండి.గౌస్‌పాషా, ఉపాధ్యక్షులుగా హైమద్ పాషా, ఎస్‌కే.యాకూబ్, ఎండీ.హలతప్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శులుగా సతీష్, సలీం, జలీల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షరీఫ్, కోశాధికారిగా అసిమ్ పాషా, మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

ఖమ్మంలో పీవైఎల్ రాష్ట్ర మహాసభలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర 2వ మహాసభలు రెండు రోజుల పాటు ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరుగనున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.రాజేందర్‌లు తెలిపారు. ఆదివారం ఖమ్మంలో పీవైఎల్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. 5, 6 తేదీల్లో మహాసభలు జరగనుండగా.. 5న సోమవారం ఖమ్మం ధర్నాచౌక్ నుంచి భక్త రామదాసు కళాక్షేత్రం వరకు యువజన ప్రదర్శన జరుగుతుందని, మంగళవారం మహాసభ బహిరంగ సభ, తర్వాత ప్రతినిధుల సభ ఉంటుందన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నగర కమిటీ ఎన్నిక



ఎన్నిక పత్రాలు అందజేస్తున్న కార్యవర్గం

ఖమ్మంఅర్బన్: తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం నగర కమిటీ ఎన్నికలకు నగరంలో 11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 27మంది పర్యవేక్షణలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. దీనిలో ఏడు వేల మంది సంఘీయులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సోమేశ్వరాచారి తెలిపారు. కాగా, సంఘం అధ్యక్షుడిగా గౌరోజు వసంతబాబు, కార్యదర్శిగా దేశరాజు వెంకటేశ్వర్లు గెలుపొందగా.. వీరితో రాష్ట్ర నాయకులు సీహెచ్.కృష్ణమాచారి, రవీంద్రచారి, శ్రీనివాసచారి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించినట్లు ఎన్నికల అధికారి విశ్వనాథుల పాపాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావుతో పాటు వెగ్గళం వెంకటేశ్వర్లు, విజయగిరి సదానందచారి, కొనపర్తి రాజేశ్వరరావు, మామిళ్లపల్లి నాగేశ్వరరావు, సోమా నాగరాజుకుమార్, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

కటకం సుదర్శన్‌కు విప్లవ జోహార్లు

ఖమ్మంమయూరిసెంటర్:సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ (ఆనంద్) మరణం పట్ల సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యాన విప్లవ జోహార్లు తెలుపుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కార్మిక కుటుంబం నుంచి కార్మిక నాయకుడిగా ఎదిగి, భారత విప్లవోద్యమానికి అంకితమై చివరి శ్వాస దాకా పని చేసిన ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు.

సమాజంలో పోలీసులది కీలకపాత్ర



కూసుమంచి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల, పక్కన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధుసూదన్

కూసుమంచి/ఖమ్మంరూరల్: సమాజంలో పోలీసులది కీలకపాత్ర అని, వారికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పోలీసుశాఖ బలోపేతమై శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని అన్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు, సుపరిపాలన ఉండటం వల్లే పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని పేర్కొన్నారు. తొలుత రూరల్ పోలీసులు ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించగా.. నాయుడుపేట నుంచి వరంగల్ క్రాస్‌రోడ్, మద్దులపల్లి, పొన్నేకల్, తల్లంపాడు మీదుగా కూసుమంచి వరకు కొనసాగింది. ఈ వేడుకలో ఏసీపీ బస్వారెడ్డి, సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, జెడ్పీటీసీ ఏ. వరప్రసాద్, ఆత్మా చైర్మన్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కంచుకోట పాలేరు



మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ పార్టీకి పాలేరు కంచుకోటగా ఉంటుందని గత ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేసి కందాలను ఎమ్మెల్యేగా చేస్తే కనీసం కార్యకర్తలకు చెప్పకుండా తన స్వర్థ ప్రయోజనాల కోసం పార్టీ మారారని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్లచెరువు సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీని మట్టి కరిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ముందుండి పనిచేసి విజయవంతం చేశానని, 100 గ్రామ పంచాయతీలలో హాథ్‌సే హాత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీ చేసిన కార్యక్రమాలను వివరించి, రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్ కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు. అలాగే డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రైతుల ఇబ్బందులు పట్టించుకోని ప్రభుత్వం రైతు సంబరాలు చేపడుతుందని, రైతులు ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని, కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించండి



లోక్యాతండాలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

కూసుమంచి: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నే ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని లోక్యాతండా ఎంపీటీసీ జర్పుల బాలాజీ నాయక్, కూసుమంచి ఉన్నత పాఠశాల హెచ్ఎం రేల విక్రంరెడ్డి కోరారు. ఆదివారం లోక్యాతండా, జగ్మల్‌తండాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్య, కల్పిస్తున్న వసతుల గురించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు.తెలంగాణ ఏర్పాటయ్యాక ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయని, మంచి ఫలితాలు సాధిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నేలపట్ల పాఠశాల హెచ్ఎం మోతీలాల్, కూసుమంచి పాఠశాల ఉపాధ్యాయులు గురువారెడ్డి, గోపాల్ రావు, సౌభాగ్యం, అనిత, సీఆర్పీలు వెంకటేశ్వర్లు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రలో మండల నాయకులు

నేలకొండపల్లి: అచ్చంపేట నియోజకవర్గంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో ఆదివారం మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం భట్టిని సన్మానించి మండలంలోని పార్టీ బలోపేతం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రేగూరి వాసవి, దోసపాటి కల్పన, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, జిల్లా నాయకులు బోయిన వేణు, కాంగ్రెస్ మండల నాయకులు రేగూరి హనుమంతరావు, దోసపాటి చంద్రశేఖర్ తదితరులు భట్టి పాదయాత్ర లో పాల్గొన్నారు.

పద్మశాలి సంఘాన్ని బలోపేతం చేయాలి

కూసుమంచి: మండలంలో పద్మశాలి సంఘాన్ని బలోపేతం చేయాలని సంఘం బాధ్యులు కోరారు. ఆదివారం మండలంలోని చేగొమ్మ, జీళ్లచెరువు తదితర గ్రామాల్లో సంఘం ఆధ్వర్యాన సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు లగ్గిశెట్టి వీరబాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందాలన్నారు. తద్వారా సంఘం ద్వారా తగిన సహాయ సహకారాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సామల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కూరపాటి భాస్కర్, గుడ్ల రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాతానిగూడెం కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీ సభ్యులు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండల పరిధిలోని సాతానిగూడెంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీను ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కీసర నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా భూక్యా రాజేష్, కార్యదర్శిగా బాదావత్ బాబు, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే.మమ్ముసాహెబ్, గ్రామ శాఖ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా భూక్యా కిరణ్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కన్నెబోయిన శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడిగా ఎస్‌కే.నాగూల్ మీరా, మైనారిటీ అధ్యక్షుడిగా రియాజ్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు నల్ల మోతు లక్ష్మయ్య, సూర నాగేశ్వరరావు, బీ.సురేష్, నవీన్, వెంకట్, మాధవరావు, నరసింహారావు, భూక్యా నాగేశ్వరరావు, ఎస్‌కే.యాకూబ్, రామకృష్ణ, ప్రవీణ్, భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.